www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 ఆగస్టు 2024
5
పశ్చిమ గోదావరి



## అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

### డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

**ప్రజాశక్తి - నరసాపురం**

భారీ వర్షాలు, వరదల కారణంగా ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం డిఎంహెచ్ఒ నరసాపురం అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే పట్టణంలో ఎన్‌టిఆర్ కాలనీ, మునిసిప్ స్ట్రీట్, అర్బన్ సెంటర్లను పరిశీలించారు. హెల్త్ నేషనల్ ప్రోగ్రామ్ అధికారిని పలు ప్రశ్నలు అడిగారు. సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని కోరారు. వరద ముంపు ప్రాంతమైన పొన్నపల్లిలో ఏర్పాటు చేసిన ప్రథమ వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట నరసాపురం డివిజన్ ఉప వైద్యాధికారి వి.ప్రసాద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

# ఇళ్లు కట్టారు.. అప్పుల పాలయ్యారు..!

**2014-19 మధ్యకాలంలో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ఎదురుదెబ్బ**

**బకాయి బిల్లులు ఇవ్వకుండా పక్కన పెట్టిన వైసిపి ప్రభుత్వం**

**ఏలూరు జిల్లాలో రూ.46.69 కోట్ల బకాయి పెండింగ్**

**12,980 మంది లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరం**

**పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే పరిస్థితి**

**పాతబకాయిలు చెల్లిస్తామని సిఎం హామీతో అంతా ఎదురుచూపు**



**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

ప్రభుత్వం సాయం చేస్తుందని ఆశ పడ్డారు. ఉన్న ఇల్లు పడగొట్టి కొత్త ఇల్లు కట్టుకునేందుకు సిద్ధమయ్యారు. సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఉవ్విళ్లూరారు. తీరా ఇల్లు నిర్మించుకున్న తర్వాత ప్రభుత్వం నుంచి సాయం రాకపోవడంతో అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులంతా ఆర్థికంగా దెబ్బతిన్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన ఇళ్ల నిర్మాణాలకు తర్వాత అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఏర్పడిన పరిస్థితి ఇది. 2019కి ముందు టిడిపి ప్రభుత్వం ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం అమలు చేసింది. సొంత స్థలం, ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు రూ.లక్షా 50 వేలు వరకూ ఇచ్చింది. ఎస్‌సిలకు రూ.రెండు లక్షలు చెల్లించేలా ముందుకు సాగారు. దీంతో అప్పట్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పేదలు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దాదాపు 32 వేల ఇళ్ల నిర్మాణం జరిగింది. అప్పట్లో నిర్మాణం జరిగిన ఇళ్లలో ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 12,980 ఇళ్లకు ప్రభుత్వం ఇస్తామన్న సాయం అందలేదు. అప్పట్లో ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల్లో కాలయాపన చేసింది. ఇంతలో 2019 ఏప్రిల్‌లో ఎన్నికలు వచ్చేశాయి. దీంతో బిల్లులు నిలిచిపోయాయి. ఎన్నికల్లో వైసిపి గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టిడిపి ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బకాయిలు ఇస్తామని జిల్లాకు చెందిన గృహనిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు అనేకసార్లు తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు మాత్రం జరగలేదు.

**అప్పుల ఊబిలో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు**

అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులంతా తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయారు. దాదాపు చేతికి రావాల్సిన రూ.లక్షా 50 వేలు రాకుండా పోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో గడిచిన ఐదేళ్లగా ఇళ్ల నిర్మాణం కోసం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో 2019కు ముందు నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు ఇవ్వాలని లబ్ధిదారులంతా కోరుతూ వస్తున్నారు. ఇటీవల సిఎం చంద్రబాబు గృహనిర్మాణ శాఖపై నిర్వహించిన సమావేశంలో 2014-19 మధ్య నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఏలూరు జిల్లాలో 12,980 మంది ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు రూ.46.69 కోట్లు రావాల్సి ఉందని జిల్లా అధికారులు లెక్కలు తేల్చి ప్రభుత్వానికి పంపించారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదేస్థాయిలో ఇళ్ల బకాయిలు రావాల్సి ఉంది. ఆ సొమ్ములొస్తే అప్పులు కొంతమేర తీరే అవకాశం ఉందని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ముందుగా తమ బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలని ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు కోరుతున్నారు. అదే సమయంలో వైసిపి ప్రభుత్వంలో ఇళ్లనిర్మించుకున్న లబ్ధిదారులకు చెల్లించాల్సిన బకాయిలపై టిడిపి కూటమి ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందనే చర్చసైతం నడుస్తోంది. ఏలూరు జిల్లాలో 1698 మంది లబ్ధిదారులకు రూ.4.2 కోట్లు వరకూ బకాయిలు రావాల్సి ఉంది. పశ్చిమలోనూ బకాయిలు పెండింగ్ ఉన్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందా.. వైసిపి ప్రభుత్వం మాదిరిగా పక్కన పెడుతుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. తాము అప్పు చేసి ఇళ్ల నిర్మాణం చేశామని, బకాయిలు చెల్లించాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేసుకునేవారికి రూ.నాలుగు లక్షలు ఇస్తామని ప్రభుత్వం చెప్పడంపైనా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 2019కు ముందు ఇళ్ల నిర్మాణ బకాయిలకు సంబంధించి ఏలూరు జిల్లా హౌసింగ్ పీడీని వివరణ కోరగా త్వరలోనే బకాయిల చెల్లింపులు జరుగుతాయని తెలిపారు.

## తేరుకుంటున్న లంకగ్రామాలు



నరసాపురం : పొన్నపల్లిలో ఇళ్ల వద్ద నీరు

**ప్రజాశక్తి - ఆచంట**

వశిష్ట గోదావరి శాంతించింది. బుధవారం నీరు లాగింది. దీంతో అధికార యంత్రాంగంతో పాటు లంకగ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ముంపుబారిన పడిన పుచ్చల్లంక, మర్రి మూల, అయోధ్యలంక, భీమలాపురం, కాపులపాలెం, కోడేరు పల్లిపాలెం, పెదమల్లం, ఆనగార్లంకలు తేరు కుంటున్నాయి. పెదమల్లం, కోడేరు, భీమలాపురం ముంపు నుంచి బయటపడ్డాయి. అయితే లంక గ్రామాలకు ఇంకా అధికారం యంత్రాంగం రాకపోకలు పునరుద్ధరించలేదు. అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. స్పెషల్ ఆఫీసర్ పిచ్చయ్య, తహశీల్దార్ ఐపి శెట్టి ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ముంపును గురైన లంక రహదారులు వరద నీరు తగ్గింది. అయితే రహదారులపై పెద్ద ఎత్తున బురద పేరుకుపోయింది. దీంతో లంకగ్రామాల వాసులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పెద్దమల్లంలోని మాచేనమ్మ ఆలయం, పర్యాటక కేంద్రాలు ముంపు నుంచి బయటపడ్డాయి.

**పశుగ్రాసం కొరత..**

లంక గ్రామాల్లోని రైతులు పశుగ్రాసం కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. లంక భూములు నీట మునగడంతో పశువులకు గ్రాసం కొరత ఏర్పడిందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పశువులకు అంటు వ్యాధులు ప్రబలకుండా పశు వైద్యాధికారి సిబ్బంది టీకాలు వేస్తున్నారు. లంక గ్రామాల్లో కూరగాయలు, పచ్చిమిర్చి, అరటి, తమలపాకు తదితర పంటలు వేసిన రైతులకు నష్టాలు తప్పలేదు. గురువారం నాటికి గోదావరి వరద ఉధృతి మరింత తగ్గే అవకాశం ఉంది.


**యలమంచిలి :** గోదావరి వరద తగ్గుముఖం పట్టినా కనకాయలంక గ్రామం మాత్రం ముంపులోనే కొనసాగుతోంది. ఆ గ్రామంలో ఇప్పటికీ స్థానికులు రాకపోకలకు అధికారులు ఇంకా ఐదు పడవలను ఉపయోగిస్తున్నారు. బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, దొడ్డిపట్లపల్లి పాలెం తదితర గ్రామాలు ఇప్పుడిప్పుడే వరద నుంచి తేరుకుంటున్నాయి. తహశీల్దార్ విజయశ్రీ లంక గ్రామాల్లోనే అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా పోలీసు, రెవెన్యూ, ఫైర్ సిబ్బందిని సమన్వయం చేస్తూ విద్యార్థులు, మహిళలు, వృద్ధులను పడవల్లో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్తలు తీసుకునే విధంగా కృషి చేస్తున్నారు.

**నరసాపురం :** నరసాపురం వశిష్ట గోదావరి ఉగ్రరూపం ఇంకా తగ్గలేదు. ఎగువు నుంచి 11 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచిపెట్టడంతో ఆ ప్రభావం వశిష్ట గోదావరిపై పడింది. బుధవారం పట్టణంలోని పొన్నపల్లి ప్రాంతం నీట మునిగి కొన్ని ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. దీంతో మున్సిపల్ అధికారులు మోటార్లు ఏర్పాటుచేసి నీటిని బయటకు తోడుతున్నారు. నీట మునిగిన ప్రాంతాల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ, కమిషనర్ వెంకటేశ్వర్లు పర్యటించారు.

# ధాన్యం సొమ్ములు చెల్లించండి

**ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు**

**జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయం వద్ద ధర్నా**



ధర్నా చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు, రైతులు

**ప్రజాశక్తి - భీమవరం**

ప్రభుత్వానికి ధాన్యం అమ్మి నెలలు గడుస్తున్నా సొమ్ములు అందించలేదని, జిల్లా వ్యాప్తంగా 30 వేల మంది రైతులు ధాన్యం డబ్బుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడడం ఆందోళనకరమని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. ఇప్పటికైనా రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి జిల్లా వ్యాప్తంగా పేరుకుపోయిన రూ.450 కోట్ల బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ కార్యాలయం ఎదుట కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం రామాంజనేయులు మాట్లాడారు. ఒకపక్క సార్వా నాట్లు పూర్తవుతున్నా గత దాళ్వా పంట డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలకు వేల కోట్లు ఖర్చు పెడుతున్నా కష్టపడి పండించిన ధాన్యానికి డబ్బులు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. రైతుల ప్రభుతమని గొప్పలు చెబుతున్నప్పటికీ ఆచరణలో కానరావడం లేదన్నారు. తక్షణం రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో కౌలు రైతుల సంఘం నాయకులు, రైతులు కవురు శ్రీనివాసు, పిల్లి కామేశ్వరరావు, కోయ పెద్దిరాజు, మద్దిశెట్టి నాగేశ్వరరావు, చిట్టినీడి బాల వెంకటేశ్వరరావు, నెక్కంటి శ్రీనివాసు, దిడ్ల నరేష్‌బాబు, పోసింశెట్టి చల్లారావు, తానుకొండ సీతారామకృష్ణ, రాంబాబు, కొండేటి నర్సింహారావు, చింతా నారాయణమూర్తి, బండారు శ్రీకృష్ణసాయి పాల్గొన్నారు.

**అధికారిని నిలదీసిన రైతులు**

జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయం ఎదుట ధాన్యం బకాయిలు చెల్లించాలని ఆందోళన చేస్తున్న రైతుల పట్ల కార్యాలయంలో పనిచేస్తున్న ఓ సీనియర్ అధికారి అనుచితంగా వ్యవహరించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా వందల కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో ధర్నా చేస్తున్న రైతుల వద్ద సంబంధిత అధికారి చిందులు తొక్కరు. 'ధాన్యం డబ్బులకు మాకు సంబంధం లేదు.. మీరు ఇక్కడ ధర్నా చేయకండి.. వెళ్లి ముఖ్యమంత్రి దగ్గరో, ఉప ముఖ్యమంత్రి దగ్గరో ధర్నా చేసుకోండి' అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసింది కాకుండా డబ్బులు అడుగుతుంటే సంబంధం లేదంటారా అని అధికారిని రైతులు నిలదీశారు. తామంతా చనిపోయాక సొమ్ములు ఇస్తారా అంటూ ప్రశ్నించారు. ధాన్యం సొమ్ములు చెల్లించకపోతే ఆత్మహత్య అయిన చేసుకుంటామని రైతులు హెచ్చరించడంతో కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఇరువురి మధ్య ఏర్పడిన ఘర్షణను సముదాయించారు. కౌలు రైతులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు సమస్యను పౌర సరఫరాల శాఖ జిల్లా డిప్యూటీ మేనేజర్ దుర్గారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సమస్యను రాష్ట్ర పౌర సరఫరాల శాఖా ఆర్థిక నిర్వహణ అధికారి నాగసుధారాణి దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 5వ తేదీలోపు జిల్లాకు రావాల్సిన ధాన్యం డబ్బులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా ముగించారు.

**గణపవరం :** మండలంలోని జల్లికాకినాడ, అప్పన్నపేట గ్రామ రైతులకు ప్రభుత్వం వెంటనే ధాన్యం బకాయిలు చెల్లించాలని కోరుతూ బుధవారం అప్పన్నపేట సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎస్.సంజీవరావు, సుబ్రహ్మణ్యం, కేతా శ్రీను మాట్లాడారు. రైతులకు ధాన్యం అమ్మిన సొమ్ములు ఇవ్వకపోతే వరిసాగు ఎలాచేస్తారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే రైతులకు, కౌలు రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమచేయాలన్నారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.మాణిక్యాలరావు, శ్రీను పాల్గొన్నారు.

## మొదటి రోజే నూరుశాతం పెన్షన్లు పంపిణీ చేయాలి

**జిల్లాలో 2,31,874 మందికి రూ. 97.26 కోట్లు విడుదల**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**ప్రజాశక్తి - భీమవరం**

జిల్లాలో పింఛను దారులందరికీ ఆగస్టు 1వ తేదీన పింఛన్ల పంపిణీ నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఇంటి వద్దే చెల్లించడానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. మొదటి రోజే నూరుశాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈ విషయాన్ని ప్రతి గ్రామమూ, వార్డులో ముందస్తు ప్రచారం చేపట్టాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లే అవకాశం ఉన్నందున, పింఛన్ల పంపిణీపై వారికి ముందస్తు సమాచారం అందించాలన్నారు. జిల్లాలో 2,31,874 మంది పింఛనుదారులు ఉన్నారని, వీరికి రూ.97.26 కోట్లు పంపిణీ చేయాలని తెలిపారు. పెన్షన్ పంపిణీ కోసం 4,243 మంది సిబ్బందిని మ్యాప్ చేసినట్లు తెలిపారు. ఎంపిడిఒలు, కమిషనర్లు సచివాలయ, ఉద్యోగి వారిగా పరిశీలించి, పంపిణీని ప్రతి గంట గంటకూ పర్యవేక్షించాలన్నారు. బయట ప్రాంతాల్లో ఉంటున్న పింఛనుదారులు సాయంత్రంలోగా వారి గ్రామాలకు విచ్చేసి పింఛను అందుకోవాలని విజ్ఞప్తి చేశారు. పింఛను పంపిణీ తీరును డిఆర్‌డిఎలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తామన్నారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండో తేదీన పింఛన్లు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.

## తాళ్లకోడు కాలనీని ఆకివీడులో కలపండి

**ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజుకు సిపిఎం విజ్ఞప్తి**



ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజుకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి - ఆకివీడు**

తాళ్లకోడు 74 ఎకరాల పేదల కాలనీని ఆకివీడు నగర పంచాయతీలో విలీనం చేయాలని సిపిఎం నాయకులు ఎంఎల్ఏ రఘురామకృష్ణంరాజుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంకాలం వచ్చిన ఎంఎల్ఎను సిపిఎం నాయకులు నగర పంచాయతీ కార్యాలయం వద్ద కలిసి మాట్లాడారు. ప్రస్తుతం కాలనీలో 500 మంది కొత్త ఇళ్లల్లో నివసిస్తున్నారని చెప్పారు. సెంటు స్థలంలో సుమారు 15 లక్షల రూపాయల వరకూ అప్పుచేసి ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఇంటిలో నుంచి బయటకొస్తే మోకాళ్ల లోతు నీటిలో నిలబడాల్సి వస్తోందని తెలిపారు. కాలనీలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎను కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు, నాయకులు పెంకి అప్పారావు, సందక సూరిబాబు, బివి.వర్మ, బొడ్డుపల్లి రాంబాబు, గోపిశెట్టి రాంబాబు, సింహాచలం, పైడమ్మ పాల్గొన్నారు.

# కనకాయలంక, పెదలంక గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

**ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలపై ఆరా**



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

**ప్రజాశక్తి - యలమంచిలి**

గోదావరి వరద తాకిడికి గురైన మండలంలోని కనకాయలంక, పెదలంక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం పర్యటించి, గ్రామస్తులతో మాట్లాడారు. తొలుత అంబేద్కర్ జిల్లా పి.గన్నవరం మండలం చాకలిపాలెం రేవు నుంచి పడవలో ప్రయాణించి పశ్చిమగోదావరి జిల్లా కనకాయలంక చేరుకున్నారు. లంక ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణించి, స్థానికంగా ఉన్న పరిస్థితులు, పంట నష్టంపై ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందరికీ అందాయా? పశు గ్రాసానికి ఇబ్బంది లేకుండా పశువుల దాణా అందిందా? ఇక్కడ ప్రధానంగా ఏం పంటలు పండిస్తారు, ఎంత నష్టం జరిగింది తదితర వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువులు అందరికీ అందాయని, పశువుల దాణాకు ఇబ్బంది లేదని గ్రామస్తులు తెలిపారు. కనకాయలంకలో సుమారు 750 ఎకరాల్లో కొబ్బరి తోటలు, తమలపాకులు, కూరగాయలు సాగు చేయడం జరుగుతుందన్నారు. 40 ఎకరాల్లో తమలపాకులు సాగు చేయగా 30 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, అలాగే 10 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని సుమారు 43 మంది రైతుల వరకు నష్టపోయారని సచివాలయం వ్యవసాయ కార్యదర్శి జిల్లా కలెక్టర్ కు వివరాలు అందించారు. పంట నష్టం వివరాలు పక్కగా లెక్కించాలని విఆర్ఒను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కనకాయలంక తుపాన్ షెల్టర్ వద్ద ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంప్‌ను సందర్శించి గర్భిణులు, బాలింతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. అందుబాటులో ఉన్నాయని కలెక్టర్‌కు వైద్య సిబ్బంది తెలిపారు. ఆమె వెంట నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, యలమంచిలి తహశీల్దార్ సిహెచ్.విజయశ్రీ, ఎంపిడిఒ పి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ పూడి డేవిడ్ సన్, విఆర్ఒ ఎస్.లక్ష్మి ఉన్నారు.

## వరద బాధితులకు సిపిఎం పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

**ప్రజాశక్తి - యలమంచిలి**

మండలంలోని వరద బాధిత ప్రాంతాలైన దొడ్డిపట్ల, లక్ష్మీ పాలెం, కట్టుపాలెం తదితర గ్రామాల్లో బాధితులను సిపిఎం బృందం బుధవారం పరామర్శించింది. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బాలరాజు మాట్లాడుతూ కట్టుపాలెంలో వడ్డిలంక స్లూయిజ్ తలుపులు వరద తాకిడికి ఊడిపోవడం వల్ల దాని ప్రభావంతో వరద నీరు వెనక్కి రావడంతో కట్టుపాలెం చింత దెబ్బలు తదితర గ్రామాల్లోని పొలాలు మునిగిపోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్లూయిజ్ తలుపులకు మరమ్మతులు చేయించాలని, వరద బాధితులకు రక్షిత నీరు అందించాలని కోరారు. ఈ కార్యాక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.జార్జి, ఇంజేటి శ్రీనివాసరావు, ఎల్.నారాయణరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఆమె రూటే సపరేటు..!

**కోళ్ల వ్యర్థాలకు రూ.800 చెల్లించాలని ఆదేశం**

**భీమవరం మున్సిపల్ కమిషనర్‌పై అవినీతి ఆరోపణలు!**




వ్యాన్‌లో తరలిస్తున్న కోళ్ల వ్యర్థాలు

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

రాష్ట్రంలోనే భీమవరానికి ఒక ప్రత్యేకత ఉంది.. దీన్ని అందుపుచ్చుకున్నారో ఏమో తెలీదు గానీ సదరు మున్సిపల్ కమిషనర్ కోళ్ల వ్యర్థాల విషయంలో రాజకీయ కనుసన్నల్లో ప్రత్యేక అనుమతులిచ్చారు.. ఈ ప్రక్రియలో లక్షల రూపాయలు చేతులు మారినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. అనుమతులు ఇవ్వడం ఒకటైతే.. ఇచ్చిన దాని ప్రకారం అక్కడ కోళ్ల వ్యర్థాల సేకరణ మరో ప్రక్రియ.. ఇంత జరుగుతోందా అంటే అంత గప్‌చుప్..

భీమవరం పట్టణంలో సుమారు వందకుపైగా మాంసం దుకాణాలు ఉన్నాయి. అయితే కోళ్లు కోసిన తర్వాత వాటి నుంచి వచ్చే పేగులు, చర్మం, కాళ్లు, వంటి వ్యర్థాలను షాపుల యజమానులు గతంలో కొంతమందికి అమ్ముకునేవారు. ఆ సొమ్మును యజమానులు షాపు నిర్వహణకు ఖర్చుచేసేవారు. లేకపోతే షాప్‌లో పనిచేసే పనివారు పంచుకునేవారు. ఏం బుద్ధి పుట్టిందో ఏమో తెలీదు గానీ కమిషనర్ సరికొత్తగా ఆలోచించి తన అధికారంతో షాపుల నుంచి ఎలా డబ్బులు వసూలు చేయాలని అని వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. దీనికోసం ఒక కాంటాక్టు పద్ధతిని ప్రవేశపెట్టి ఒక వ్యక్తికి ఈ కోళ్ల వ్యర్థాలు సేకరించే విధంగా కాంట్రాక్టు ఇచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చిన ఈ విధానంలో కాంట్రాక్టర్ చికెన్ సెంటర్ దగ్గరకెళ్లి కోళ్ల వ్యర్థాలను సేకరించి వాటిని సుదూర ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ ఒక గొయ్యి తీసి గోతిలో వేసి కప్పెట్టాలి. దీనికోసం మున్సిపాల్టీకి ఛార్జీల రూపంలో షాపు యజమాని నెలకు రూ.800 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో రూ.500 మున్సిపాల్టీకి రూ.300 కాంట్రాక్టర్‌కు ఇచ్చేలా ఒప్పందం జరిగింది. అనుకున్నదే తడవుగా షాపుల యజమానులకు కమిషనర్ హుకుం జారీ చేశారు. ఇది ఎక్కడి గోలరా బాబు అంటూ షాపుల యజమానులు తాము వేరే వ్యక్తికి ఇస్తున్నామని చెప్పినప్పటికీ వారిపై అనేక ఒత్తిడులు తెచ్చి కేసులు పెడతామని బెదిరించినట్లు సమాచారం. ఇక్కడ వరకూ బాగానే ఉన్నా మున్సిపాల్టీకి ఆదాయం వస్తుందనుకుంటే అవేమీ జరగలేదు. సదరు కాంట్రాక్టర్ నెల నుంచి పట్టణంలోని ప్రతి షాపు వద్దా వస్తున్న వ్యర్థాలను దర్జాగా తీసుకెళ్లి తూర్పుగోదావరి జిల్లాలోని చేపల చెరువులకు మేతలుగా తరలిస్తున్నట్లు సమాచారం. అయితే కమిషనర్ ది కూడా అదే జిల్లా కావడంతో మరిన్ని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే కోళ్ల వ్యర్థాల సేకరణ నిమిత్తం కమిషనర్ ఇచ్చిన నిబంధనలు అమలు అవుతున్నాయా లేదా అనేది ఎప్పుడూ కూడా ఆమె తనిఖీ చేయలేదని, అంటే ఇదంతా పక్కా పథకం ప్రకారమే జరుగుతోందని, అయినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకపక్క మున్సిపల్ పాలకవర్గం లేకపోవడంతో ఆ అధికారి ఇష్టారాజ్యమని, దీంతో కోళ్ల వ్యర్థాలతో లక్షల రూపాయలు చేతులు మారాయని విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా భీమవరంలో మాత్రమే చికెన్ షాపులకు పన్నులు విధించి తమ ఆదాయానికి గండి కొడుతున్నారని షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉతాధికారులు భీమవరంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని, సదర వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

## అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం : పితాని

**ప్రజాశక్తి - ఆచంట**

నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, అధైర్య పడొద్దని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలో ఆచంట వేమవరం, పెనుమంచిలి, ఆచంట గ్రామాల్లో అధిక వర్షాల కారణంగా ముంపునకు గురైన నారుమడులు, పంట పొలాలను, చేనేత మగ్గాలను, వైఎస్ఆర్ గృహాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ నారుమడులు దెబ్బతిన్న స్థానే స్వల్పకాలిక రకాలైన ఎంటియు 1153, ఎంటియు 1156, పిఆర్ 126 వంటి రకాలు వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తరపున విత్తనాలను రాయితీపై అందిస్తామన్నారు. మండలంలో 125 ఎకరాల్లో నారుమడులు, మరో 2,150 ఎకరాల్లో వరినాట్లు ముంపునకు గురైనట్లు పాలకొల్లు ఎడిఎ అడ్డాల పార్వతి, ఎంఎల్ఎకు వివరించారు. ఆచంట నక్కల కాల్వ ఉధృతి కారణంగా చేనేత కార్మికుల మగ్గాల గుంతలోకి నీరు చేరడంతో పని లేకుండా పస్తులు ఉంటున్నామని, ఆదుకోవాలని కార్మికులు కోరారు. అనంతరం వేమవరంలో గత ప్రభుత్వంలో ఇచ్చిన వైఎస్ఆర్ కాలనీలకు కనీస సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా వాటిని పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం కాలువలో చెత్తకూ స్ప్రెయింగ్ కూడా చేయించలేదన్నారు. నక్కల కాలువ పొంగడం వల్ల ఆచంట, పోడూరు మండలాలు ముంపుబారిన పడ్డాయన్నారు. ముంపునకు గురైన లంక గ్రామాలకు నిత్యాసరుకులు, పశువులకు పశు గ్రాసం ఏర్పాటు చేసి ఆదుకు న్నామన్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి డి.సూర్యకుమారి, పెను మంచిలి సర్పంచి గణేశుల శేషవాని సుబ్బారావు, మండల అధ్యక్షులు కేతామీరయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

## ఎంపిడిఒ కేసులో పలు అనుమానాలు!

**నరసాపురం:** నరసాపురం ఎంపిడిఒ వెంకట రమణారావు ఆత్మహత్య కేసులో మరో ట్విస్టు చోటు చేసుకుంది. ఈనెల 15న ఆయన అదృశ్యంపై కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎనిమిది రోజుల అనంతరం ఎంపిడిఒ ఈనెల 23వ తేదీన ఏలూరు కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన మృతదేహం దొరకడంతో నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. న్యూడ్ వీడియో కాల్స్ గ్యాంగ్ బెదిరింపులకు ఎంపిడిఒ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పలు ఉత్తరాది రాష్ట్రాల అక్కౌంట్లకు ఎంపిడిఒ నగదు బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ దిశగా పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఎంపిడిఒను బ్లాక్ మెయిల్ చేసిన నిందితులను ఏపి పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఎంపిడిఒ రమణారావును బ్లాక్ మెయిల్ చేసింది రాజస్థాన్ భరత్‌పూర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి మూడు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అనంతపురం జిల్లా సింగనమల పోలీసులు వేరే కేసులో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఎంపిడిఒ కేసులో అతని ప్రమేయం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ సైబర్ నేరగాడిని కస్టడీకి తీసుకుని విచారణ చేపట్టాలని కృష్ణా జిల్లా పోలీసులు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ గ్యాంగ్‌లో 20 నుంచి 25 మంది ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఏపి పోలీసుల కదలికలు గుర్తించి వారంతా పరారైనట్లు తెలుస్తోంది. రమణ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి వారి బెదిరింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని ప్రచారం సాగుతోంది.

## మండల పరిషత్ సమావేశంలో సమస్యల ఏకరువు

**ఉండి:** మండలంలో గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యం, సమస్యలు ఘనం అని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు విమర్శించారు. బుధవారం సాయంత్రం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమస్యలను ప్రధానంగా సభ్యులు విమర్శించారు. ఈ సమావేశంలో ఉప్పులూరు సర్పంచి యర్రా దుర్గారావు మాట్లాడుతూ తమ గ్రామంలోని జగనన్న కాలనీ అప్పటికే ఆక్రమించిన ఆరు కుటుంబాలను ఖాళీ చేయించకుండా అప్పటి నాయకులు జగనన్న కాలనీ ఏర్పాటు చేశారని, అధికారులు కూడా వారికి మద్దతుగా నిలవడంతో లబ్ధిదారులు ఇప్పుడు లబోదిబోమంటున్నారని ఆయన వివరించారు. అనంతరం ఎంపిపి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి ఒక్క సభ్యులు మండలాభివృద్ధికి కృషి చేయాలని, అధికారులు సమస్యలను పరిష్కరించేందుకు సమాయత్తం కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## విద్యార్థులు భవిష్యత్తులో రాణించాలి

### ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి

**గణపవరం:** విద్యార్థులు కాలేజీలో విద్యాభివృద్ధితోపాటు క్రీడా సాంస్కృతిక రంగాల్లో సాధించిన విజయాలను గుర్తు చేస్తూ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. గణపవరం డిగ్రీ కాలేజీలో బుధవారం డిగ్రీ ఫైనల్ ఇయర్ పూర్తయిన విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. యూనివర్సిటీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు బి.అక్కరాజు, సిహెచ్.చైతన్య, ఎన్ఎస్ఎస్ బి.శ్రీనివాసరావు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి : పిడిఎస్‌ఒ

**తాడేపల్లిగూడెం:** రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని పిడిఎస్‌ఒ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్ పేర్కొన్నారు. పిడిఎస్‌ఒ రాష్ట్ర పిలుపులో భాగంగా డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలని పెంటపాడు గోపయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక, ఎన్నో ఏళ్లుగా రెగ్యులర్ అధ్యాపకుల నియామకం జరగకుండా, అవుట్‌సోర్సింగ్, గెస్ట్, కాంట్రాక్టు లెక్చరర్లతోనే కాలేజీలు నడుస్తున్నాయన్నారు. ఎటువంటి మినహాయింపులు లేకుండా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వర్తింప చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గోపి, గంగరాజు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకులకు సముచిత స్థానం కల్పించాలి

**భీమవరం టౌన్:** భీమవరం నియోజకవర్గంలోని టిడిపి నాయకులకు నామినేటెడ్ పదవుల నియామకంలో అత్యధిక శాతం సముచిత స్థానం కల్పించాలని మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలోని వినతుల స్వీకరణలో ఇన్‌ఛార్జులు, రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారథి, టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు తోట సీతారామలక్ష్మిలకు భీమవరం, వీరవాసరం మండలాలు, పట్టణ టిడిపి కమిటీల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వినతిపత్రాలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు కోళ్లపర్తి శ్రీనివాస్, ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, రేవు వెంకన్నలు మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలోని సుమారు 300 మంది టిడిపి నాయకులు పార్టీ ఆదేశించిన అన్ని కార్యక్రమాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో విశేషకృషి చేశారన్నారు. టిడిపి నాయకులకు అత్యధిక శాతం నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

**తాడేపల్లిగూడెం:** ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని సిద్ధ్యాప్స్ గోడౌన్ అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సిద్ధ్యాప్స్ గోడౌన్స్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో నల్లజర్ల రోడ్డులోని సిద్ధ్యాప్స్ గోడౌన్ ప్రహరీ గోడ పొడవునా మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్ కుమార్ వేప మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోడౌన్ సూపరింటెండెంట్ శ్రీ సాయికుమార్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి

**వీరవాసరం:** ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచి మంగతాయారు బుధవారం గ్రామ ప్రజలకు సూచించారు. గత కొద్దిరోజులుగా ఎడతెరిపి లేని వర్షాల వల్ల పలు ప్రాంతాల్లో తమ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా దోమల నివారణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పంచాయతీ వారు తీసుకునే చర్యలకు అనుగుణంగా గ్రామస్తులు కూడా సహకరించాలని కోరారు.

**పాలకొల్లు రూరల్:** లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అల్లూరి ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో చింతపర్రు గ్రామంలో జ్వరాలపై సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులకు వైద్యం చేపట్టారు. గ్రామ సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని తెలిపారు.

## బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**నరసాపురం:** నరసాపురం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా పొలిశెట్టి మోహన బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా రంపా పుల్లాజీ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోసెఫ్ తెలిపారు. నరసాపురం న్యాయవాదుల సంఘం కార్యవర్గ ఎన్నికలు బుధవారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. గ్రంథాలయ కార్యదర్శిగా [illegible] శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శిగా మేడిది శ్రీకాంత్, మహిళా ప్రతినిధిగా బొద్దు ప్రగతి ఎన్నికయ్యారని ఆయన వివరించారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి రమేష్, కోశాధికారిగా [illegible], సహాయ కార్యదర్శిగా కురెళ్ల సోమశేఖర్, కార్యవర్గ సభ్యులుగా [illegible] ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణలో న్యాయవాది గొట్టుముక్కల ఆశీష్ వర్మ కూడా తోడ్పడినట్లు తెలిపారు.

## నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

**మొగల్తూరు:** మండలంలోని గ్రామాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నామని సిడిపిఒ బి.ఊర్మిళ బుధవారం తెలిపారు. గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో ఈనెల 1వ తేదీ నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియపరుస్తూ అవగాహన కల్పించనున్నామన్నారు.

## 3న డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

**పాలకొల్లు:** ఈనెల 3వ తేదీ శనివారం ఉదయం పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 42వ కళాశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆమె తెలిపారు.


ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# దాట్లది ప్రత్యేక స్థానం

## వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - పెనుమంట్ర

జిల్లాలో కలకాలం గుర్తుండే ప్రముఖ వ్యక్తులలో ఎస్ఆర్.దాట్లది ప్రత్యేక స్థానమని సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం అన్నారు. ప్రముఖ కమ్యూనిస్టు ఉద్యమ నేత ఎస్ఆర్.దాట్ల 45వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రం పెనుమంట్రలో నిర్వహించారు. ఉదయం వారి స్మారక స్థూపం వద్ద సిపిఎం కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యాన నివాళులర్పించారు. బ్రాహ్మణ చెరువు నుంచి పెనుమంట్ర స్థూపం వరకూ ర్యాలీ నిర్వహించి, అనంతరం స్థూపం వద్ద ఉన్న జెండాను కల్లు గీతా కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహ మూర్తి ఆవిష్కరించారు. స్థూపంపై ఉన్న దాట్ల చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, కె.గోపాలన్ పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం సభను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ అణగారిన ప్రజానీకం, కార్మికవర్గ, వ్యవసాయ కార్మికులు, రైతుల సమస్యలు పరిష్కారంలో కృషి చేశారని తెలిపారు. అత్తిలి నియోజకవర్గ ఎంఎల్ఎగా దాట్ల పనిచేసి ప్రజల మన్ననలను పొందారని బలరాం కొనియాడారు. జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ గీత కార్మిక హక్కుల కోసం గ్రామ గ్రామాన తిరిగి సంఘ నిర్మాణంలో దాట్ల కృషి అమోఘమని అన్నారు. సిపిఎం నాయకులు చింతపల్లి శ్రీరాములు, కృష్ణంరాజు, ఉప్పు రంగారావు, రామాంజనేయులు, మంగ సూర్యనారాయణ నాగేశ్వరరావు, నక్క కాంతారావు, లింగం సత్యనారాయణ, వీరవాసరం సిపిఎం మండల కార్యదర్శి జయ నివాళులర్పించారు.



వర్ధంతి సభలో పాల్గొని నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

**ఉచిత మెడికల్ క్యాంప్:** పెనుమంట్ర శివారు బ్రాహ్మణ చెరువులోని చింతపల్లి స్మారక బస్టాండ్ వద్ద బుధవారం దాట్ల వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా మందులు, వివిధ రకాల వ్యాధులకు ఉపయోగపడే విధంగా హైదరాబాద్ బయలాజికల్ ఈ లిమిటెడ్ వారి సహకారంతో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్టుగానే, ఈ సంవత్సరం విజయ్ కుమార్ దాట్ల జ్ఞాపకార్థం వారి కుమార్తె మహిమ దాట్ల సహకారంతో మందులు పంపిణీ చేశారు. ఎస్ఆర్ దాట్ల అల్లుడు సిహెచ్.రాఘవ రాజు కృషి ఫలితంగా మందులు ఇస్తున్నట్టుగా సిపిఎం మండల కార్యదర్శి సుబ్బరాజు తెలిపారు. బుధవారం క్యాంపు బ్రాహ్మణ చెరువు, చక్రధర్ హెల్త్ కేర్, డాక్టర్ ఎస్‌కెఎస్ఎస్ సతీష్ రెడ్డి పర్యవేక్షణలో ప్రజలకు లక్షల రూపాయలు ఖరీదు చేసే మందులు పంపిణీ చేయడం అభినందించే విషయమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆకుల హరే రామ్ పర్యవేక్షణలో చింతపల్లి లక్ష్మి కుమారి, చింతపల్లి అప్పారావు, చదలవాడ లక్ష్మణరావు, కుడిపూడి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు అందజేస్తా

### హామీకి కట్టుబడి ఉన్నా : ఎంఎల్ఎ అంజిబాబు

**భీమవరం టౌన్:** పాత్రికేయులంటే ఎంతో అభిమానం, గౌరవమని, భీమవరం నియోజకవర్గంలోని ప్రతి పాత్రికేయుడు సొంత స్థలం కలిగి ఉండాలన్నదే తన ఆశయమని, దానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. బుధవారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఎ అంజిబాబును భీమవరం పాత్రికేయులు కలిసి సమస్యలను తెలియజేశారు. దీనిపై ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ త్వరలోనే ప్రతి జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు అందజేస్తానని, గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నానని అన్నారు. త్వరలో తాను, తమ మిత్రులు కలిసి ఒక ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆపదలో ఉన్నవారిని నిరుపేదలకు వైద్యం, విద్యకు నోచుకోని వారికి ఈ ట్రస్ట్ ద్వారా సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం పాత్రికేయులు కె.ధనరాజ్(నాని), పత్సమట్ల శ్రీనివాసరాజు, బిట్రా శివకుమార్, గూడూరి నాగరాజు, తాతారావు, కేతా సత్యనారాయణ, కడలి సాయిబాబా, ప్రసాద్, మద్దిరాల రాజేష్, ప్రసన్న, కృష్ణ, అయ్యప్ప, శ్రీనివాస రాజు, తేజారావు, అల్లూరి అరుణ్, జయకుమార్, నిమ్మల అది, వెంకటేష్, బ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

## శ్రీనివాస్ సేవలు అభినందనీయం

**నరసాపురం:** అభయ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నూలి శ్రీనివాస్ డాక్టరేట్ సాధించడం అభినందనీయమని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. ఇటీవల బెంగుళూరుకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరర్ అకాడమీ సంస్థ వారు నూలి శ్రీనివాస్ సమాజంలో చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా నూలి శ్రీనివాస్‌ను ఎంఎల్ఎ నాయకర్ పుష్పగుచ్ఛంతో అభినందించి భవిష్యత్తులో మరిన్ని సేవలను అందిస్తూ, మరింత గుర్తింపు పొందాలని సూచించారు. కార్యక్రమంలో జక్కం బాబ్జీ, మైల వీర్రాజు, గంటా కృష్ణ ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

**పాలకోడేరు:** శృంగవృక్షం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ అరుణ కుమారి రైతులకి కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కోడిగుడ్డు, నిమ్మరసం తయారు చేసే విధానాన్ని రైతులకు, ఎస్ఎస్‌జి మహిళలకు వివరించారు. ఒక ఎకరానికి నిమ్మరసం రెండు లీటర్లు, కోడిగుడ్లులు 12 తీసుకోవాలన్నారు. ముందుగా గాజు సీసాలో నిమ్మరసం పోసి, కోడి గుడ్లు ఒకదాని మీద ఒకటి పెట్టి 12 రోజులు నుంచి 15 రోజులు ఉంచాలన్నారు. తర్వాత వడగట్టుకుని పావు కిలో బెల్లం కలిపినట్లయితే కోడిగుడ్డు నిమ్మరసం తయారవుతుందన్నారు. ఒక ఎకరానికి పావు లీటర్ కోడిగుడ్డు నిమ్మరసం 200 లీటర్ల నీటిలో కలుపుకొని వరి పొలంపై పిచికారీ చేయాలని సూచించారు. మండల ఇన్‌ఛార్జి సిహెచ్.రవికుమార్, ఎన్.దుర్గారావు, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

## పలుచోట్ల 'మిషన్ శక్తి'

ప్రజాశక్తి - యలమంచిలి

బాల్య వివాహాలను అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసిడిఎస్ సిడిపిఒ పి.నాగరత్నం అన్నారు. ప్రధానమంత్రి మిషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఇలపకుర్రు హైస్కూల్ వద్ద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరత్నం మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ చదువుకునే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని, బాలురకు చిన్నతనం నుంచే సమాజం పట్ల బాధ్యతగా మెలిగే విధంగా క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తే భవిష్యత్తులో ఆడపిల్లలు, మహిళలపై దాడులు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూలు టీచర్స్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

**ఉండి:** మిషన్ శక్తి కార్యక్రమం చిన్నారులకు వరం లాంటిదని ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం అన్నారు. ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలో ఐసిడిఎస్ సిడిపిఒ అధ్యక్షతన ప్రధానమంత్రి మిషన్ శక్తి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆరోగ్యకరమైన విషయాలు గురించి, ప్రభుత్వం నుంచి వచ్చే వాటి గురించి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వి.నిర్మల, అంగన్వాడీ కార్యకర్తలు ప్రేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిఎంపి, ఆర్ఎంపిలు నిబంధనలు పాటించాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు

**భీమవరం:** జిల్లాలోని పిఎంపి, ఆర్ఎంపిలు(క్వాక్స్) ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని, అలా చేయకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది పిఎంపి, ఆర్ఎంపిలు(క్వాక్స్) అబార్షన్లు, రోగులను అడ్మిట్ చేసుకొనుట, ఐవి ఫ్లూయిడ్స్ పెట్టుట, ఇంజెక్షన్లు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని పిఎంపి, ఆర్ఎంపిలు ఫస్ట్ ఎయిడ్, గాయాలకు, పుండ్లకు కట్లుకట్టు, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు, సలహాలు అందించాలన్నారు. ఏమైనా కేసులు వారి దృష్టికి వస్తే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయాలని తెలిపారు.

## ప్రజా భాగస్వామ్యంతో గ్రామాలాభివృద్ధి : ఎంఎల్ఎ బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం:** ప్రభుత్వంలో నిధుల కొరత కారణంగా గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రజలందరూ సహకరించాలని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం పెంటపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం పంచాయతీలు, ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్, 14వ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించడం గ్రామపంచాయతీల పాలిట శాపమైందన్నారు. పంచాయతీల్లో నిధులు లేక, కనీస సౌకర్యాలు కల్పించలేక గ్రామాల్లోని ప్రజాప్రతినిధులను దిష్టిబొమ్మలుగా మార్చిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా గ్రామాభివృద్ధికి ఎవరు ముందుకు వచ్చినా, ప్రజలందరినీ భాగస్వాములను చేసి తాను కూడా భాగస్వామిని అవుతానని, సొంత నిధులతో కొంతైనా అభివృద్ధి చేద్దామని, తనకు సహకరించాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, దాసరి హైమావతి, ఇన్‌ఛార్జి ఎంఆర్‌ఒ యు.వెంకటేశ్వర్లు, ఎండిఒ బాలాజీ, జెడ్‌పిటిసి ఉప్పులూరు వరలక్ష్మి, ఎంఇఒ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

### సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్

ప్రజాశక్తి - కాళ్ల

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని అటువంటి వారిలో కనకరాజు ముందు ఉంటారని సమగ్ర శిక్ష ఎడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ అన్నారు. కాళ్ల మండల విద్యాశాఖాధికారి-2గా పనిచేస్తున్న గాదిరాజు కనకరాజు ఉద్యోగ విరమణ అభినందన సభను పెదఅమిరం నిర్మలా దేవి ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. మాలవాని తిప్ప హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరాజు అధ్యక్షత వహించారు. బుధవారం ఏలూరుపాడు హైస్కూల్ ఉపాధ్యాయుడు కట్టా వెంకటేశ్వరరావు సభను నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శమని భీమవరం ఉపవిద్య శాఖాధికారి ఎన్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. విద్యాశాఖలో ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యా శాఖాధికారిగా పనిచేసి, అందరి మన్ననలు పొందిన అధికారి కనకరాజు అని పలువురు వక్తలు కొనియాడారు. కనకరాజును తోటి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకు ఉంటుందన్నారు. ఉద్యోగ విరమణ ప్రధానోపాధ్యాయుని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావం, సచ్ఛీలత, వృత్తిపట్ల గౌరవం కలిగిన ఉపాధ్యాయుడన్నారు. రిటైర్డ్ జిల్లా విద్యాశాఖ అధికారి ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ 35 ఏళ్ల పాటు విద్యాశాఖలో సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పిఆర్‌విఎస్.సాయివర్మ, పిఆర్‌టియు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి టివివి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



గాదిరాజు కనకరాజు దంపతులను సత్కరిస్తున్న శ్యాంసుందర్

## పైపులైన్ పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామపంచాయతీల్లో నిధులులేని పరిస్థితి ఉన్నప్పటికీ ప్రజలకు అత్యవసరమైన తాగునీరు అందించేందుకు పైపులైను పనులు చేసేందుకు గ్రామ సర్పంచి శ్రీనివాసరాజు ముందుకు రావడం అభినందనీయమని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ తానింకి శ్రీనివాసరావు అన్నారు. సుభాష్ చంద్రబోస్ మాజీ సైనిక కాలనీ గ్రామంలో పైప్‌లైన్ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ బుధవారం చేశారు. పంచాయతీ నిధులు రూ.2.75 లక్షలతో గ్రామ సర్పంచి మంతెన శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం చుట్టారు. గతంలో వేసిన పైప్‌లైన్‌లు దెబ్బతిని లీకేజీలు ఏర్పడడంతో కలుషిత నీరు వస్తుంది. దీంతో గ్రామ ప్రజలు సర్పంచి శ్రీనివాసరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన శ్రీనివాస్ రాజు పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు, పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. దీంతో బుధవారం పంచాయతీ నిధులు రూ.2.75 లక్షలకు ఎస్టిమేషన్ వేయించారు. వర్షాకాలం దృష్ట్యా వర్షపునీరు నిల్వ ఉండకుండా కచ్చా డ్రెయిన్ తవ్వకం పనులు పంచాయతీ నిధులు రెండు లక్షలతో చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్(గ్రామీణ నీటి సరఫరా) ఇంజనీరింగ్ అధికారి ఎఇ తానింకి శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ స్వామి, పంచాయతీ కార్యదర్శి ఇ.సుబ్బారావు, పంచాయతీ వార్డు సభ్యులు ఉప్పలపాటి యేసు, పొన్నమిల్లి గుణవతి పాల్గొన్నారు.



కచ్చా డ్రెయిన్ తవ్విస్తున్న సర్పంచి

## 23న లేసుపార్కు పాలకవర్గం ఎన్నిక

**నరసాపురం:** మండలంలోని రుస్తుంబాదలోని లేసుపార్కు పాలకవర్గం గడువు ముగియడంతో నూతన పాలక వర్గానికి చర్యలు తీసుకుంటున్నట్లు లేసు పార్కు ప్రాజెక్టు మేనేజర్ కుసుమ కుమారి తెలిపారు. అలంకృతి లేసు తయారీ పరస్పర సహాయ సహకార సంఘముల పాలకవర్గం ఎన్నిక ఆగష్టు 23న నిర్వహిస్తామని తెలిపారు.

## విద్యార్థులు దేశానికి ఆదర్శంగా నిలవాలి

### జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి ఛాన్సలర్ మురళీకృష్ణ

**భీమవరం టౌన్:** సొసైటీకి ఉపయోగపడే విధంగా ఇంజనీర్లుగా తయారై మంచి పరిశ్రమలు స్థాపించి, దేశానికి ఆదర్శంగా నిలవాలని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డాక్టర్ కెవిఎస్ జి.మురళీకృష్ణ కాబోయే ఇంజనీర్లకు సూచించారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు నిర్వహించిన ఓరియంటేషన్ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మహనీయులు సాధించిన విజయాలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం దేశంలోనే ప్రతిష్టాత్మకమైన కాకినాడ జెఎన్‌టియు ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన డాక్టర్ కెవిఎస్ జి.మురళీకృష్ణను కళాశాల యాజమాన్యం తరపున ఘనంగా సత్కరించారు.

## పైపులైన్ల వినియోగంలోకి ఏర్పాట్లు పూర్తి : ఎంఎల్ఎ

**ఆకివీడు:** ఆకివీడు, కాళ్ల మండలాలకు గోదావరి జలాల కోసం సుమారు 18 సంవత్సరాల క్రితం పరిమళ్ల లాకుల వద్ద నుంచి నిర్మాణం చేసిన పైప్‌లైన్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు అన్నారు. బుధవారం సాయంకాలం స్థానిక నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం పాలకవర్గ ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా నాటి ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు ప్రతిపాదనల మేరకు చేపట్టిన వెంకయ్య కాలువ రూ.30 కోట్ల ఫైపైలైన్ పథకం నిరుపయోగంగా మారిందన్నారు. పథకం మొత్తం నిర్మాణం పూర్తయింది, నామమాత్రపు అదనపు పనులు చేపట్టవలసి ఉందన్నారు.

## జిఒ 85పై పునరాలోచించాలి

**పెనుమంట్ర :** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 85ను పునరాలోచించాలని కోరుతూ పలువురు ప్రభుత్వ వైద్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఆయన్ని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్స్ కలిసి ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశంకు తెచ్చిన ఇన్సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జిఒ 85 గురించి ప్రభుత్వం పునరాలోచన చేయాలని ప్రభుత్వ వైద్యుల సంఘం తరుపున కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎంఎల్ఎ పితాని హామీ ఇచ్చారు.

**మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టులో అమలాపురం**
**H.M.O.P. No. 190/2022**

*Between:*
ఈతకోట దుర్గారావు ... పిటీషనర్
మరియు
ఈతకోట(సిర్రా)బ్లెస్సీ ... రెస్పాండెంటు

**పేపరు ప్రకటన**

రెస్పాండెంటు:- ఈతకోట (సిర్రా) బ్లెస్సీ, w/o దుర్గారావు, హిందువు, గృహిణి, వయసు 24సంII D/o సిర్రా జయరావు, డోర్.నెం.3-36/1, పెనుమంట్ర-534268 పIIగోII జిల్లా.

పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీకు అమలు జరిగియుండలేదు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రకటన ద్వారా రెస్పాండెంటు అయిన మీకు తెలియ పరుచుచున్నాము. వాయిదా ది.08-08-2024వ తేదిన మీరు స్వయంగా గాని మీ ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి 10.30నిIIలకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియపరుచుకోవలెను. లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.

వాయిదా తేదీ:- 08-08-2024, సమయం:- 10.30 నిIIలకు.
ఎన్. మల్లికార్జునరావు
న్యాయవాది అమలాపురం

**మహారాజశ్రీ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ వారి కోర్టులో, తణుకు**
**O.S.No.115/2023**

Between:
విజయా బ్యాంక్, Now బ్యాంక్ ఆఫ్ బరోడా, Rep by its Manager, తణుకు ...వాది
మరియు
షేక్ రోషన్ ఆలీ మరియు ఇంకొకరు ...ప్రతివాది

**ప్రకటన**

పై నెంబరు గ్రంథములో షేక్ రోషన్ ఆలీ, S/o.మహబూబ్ ఆలీ, డోరునెం.31-3-2, స్త్రీ సమాజం రోడ్, తణుకు అను మీరు ఒకటవ ప్రతివాది అయివున్నారు. పై నెంబరు గ్రంథములో మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్ని అమలు జరుగనందున శ్రీకోర్టు వారు పేపర్ పబ్లికేషన్ ఉత్తర్వులు ఇచ్చియున్నారు. పై నెంబరు గ్రంథము 05-08-24 తేదికి వాయిదా అయివున్నది. కావున మీరు ఈ ప్రకటన వెలువడిన 30 రోజులలో శ్రీకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 నిIIలకు మీరు స్వయముగా కాని/ మీ యొక్క ప్లీడరు గారి ద్వారా హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెయును. లేనియెడల సదరు గ్రంథము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.
శ్రీకోర్టు వారి ఉత్తర్వులతో..

O.N.KRISHNA
తణుకు అడ్వకేట్, తణుకు
తేది.31-7-24 సెల్: 9848199440

**LOSS OF PASSPORT**

I, OSURI VENKATA CHANDRAVATHI W/o. Vegesna Surendra Kumar, D.No.11-4-37, Near School, Peechupalem, 15th Ward, Narasapur, Narasapur Mandal, W.G.Dt. A.P. When I came to parents house along with children to India on Vacations My Minor Daughter Original American Passport of Kum. VEGESNA AAVYAA Bearing No. 670123380 Dated 08-10-2021 Date of Expiry 07-10-2026 was issued by the USA was lost in my parents house. If any found please handover to the above address and will be awarded.

**పాస్‌పోర్టు పోయినది**

పోదూరు మండలం వేడంగిపాలెం పంచాయతీ, చైతన్య నగర్, డోర్ నెంబర్ 4-112/1, w.g.dt కు చెందిన పరువు జ్ఞానరాజు గారి కుమారుడు పరువు చాణక్య రాజు, తెలుపుకొను విన్నపం ఏమనగా నేను ది 27-7-2024 వ తేదీన నా పాస్ పోర్ట్ కవర్ లో పెట్టి విజయవాడ నుంచి భీమవరం వచ్చి భీమవరం కొత్త బస్టాండ్‌లో బస్ దిగి మావుళ్ళమ్మ గుడి దగ్గరకు వెళూతుండగా మార్గమధ్యలో సదరు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పోయినది. దీనిని నేను 18-06-2018 న వైజాగ్ పాస్ పోర్ట్ కార్యాలయం నుండి S1604089గా పొందియున్నాను. ఎంత వెతికిన దారిలో దొరక లేదు.ఎవరికైన దొరికితే నాకు అందజేయగలరు.

సెల్ నెం.9000264685

**ప్రకటన**
**మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), భీమవరం వారి కోర్టులో**
**F.D.P.No.3/2024 in O.S.No.227/2023**

గొట్టుముక్కల శ్రీనివాసరాజు ...వాది
మరియు
తిరుపతి రమేష్ ...ప్రతివాది

**ప్రతివాది:** శ్రీ తిరుపతి రమేష్, S/o.సత్య నారాయణ, డోరునెం.3-19, కొండంగి, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు గ్రంథంలో ప్రతివాది అయిన శ్రీ తిరుపతి రమేష్ గార్కి శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను తీసుకొనక, అందుకొనక కాలయాపన చేయుచున్నారని, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటన అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ది.27-8-2024 తేదీకి వాయిదా అయివున్నది. కావున ప్రతివాది అయిన శ్రీ తిరుపతి రమేష్ గారు ది.27-8-2024 ఉదయం 10.30 నిIIలకు తమ అభ్యంతరములు స్వయంగా గాని, తమ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేనియెడల సదరు ప్రతివాది అయిన శ్రీ తిరుపతి రమేష్ గారిని పరోక్షమున తీర్మానించబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

అల్లూరి వెంకటేశ్వరరాజు
భీమవరం వాది తరపు అడ్వకేట్,
తేది.30-7-24 సెల్: 9848211102

**In The Court Of Junior Civil Judge Bhimadole Eluru Dist.**
**I.A.No. 426/2022**
**O.S.No. 52/2015**

***Between:***
గుమ్మడి ముత్యాలుదేవి ..వాది
మరియు
చిలకపాటి ఈశ్వరదేవి వగైరాలు ...ప్రతివాదులు

***To:***
1. చిలకపాటి ఈశ్వరదేవి, భర్త: (లేటు) వెంకట సత్యనారాయణ, మేదినరావుపాలెం, దెందులూరు మండలం,
2. చిలకపాటి హనుమాన్‌ప్రసాద్, S/o వెంకట సత్యనారాయణ, మేదినరావుపాలెం, దెందులూరు మండలం,
3. కేతినేని రమణ, S/o సుబ్బారావు, పెరుగుగూడెం, దెందులూరు మండలం,

పై నెంబరు దావాను వాది అయిన గుమ్మడి ముత్యాలుదేవి గారు భీమడోలు కోర్టులో ప్రతివాదులపై దావా దాఖలు చేసియిన్నారు. సదరు దావా గ్రంథములో 1వ, 2వ, 3వ ప్రతివాదులు అయిన 1. చిలకపాటి ఈశ్వరదేవి, 2. చిలకపాటి హనుమాన్‌ప్రసాద్, 3. కేతినేని రమణ, మేదినరావుపాలెం, దెందులూరు మండలం, వార్కి నోటీసు నిమిత్తం **ది.14-08-2024వ తేదికి** వాయిదా అయివున్నది. కావున సదరు ప్రతివాదులు పై కోర్టు వారి ఎదుట **ది.14-08-2024వ తేది ఉదయం 10-30 నిIIలకు** హాజరు అయి తమకు గల ఆక్షేపణలు తెలుపుకోనవలెను. లేని యెడల వారిని ఎక్స్‌పార్టీ చేసి దావా తీర్మాణము చేయబడును.

భీమడోలు **S. GOPALA KRISHNA**
తేది:25-07-2024 **L. SUDHARANI**
వాదితరుపు న్యాయవాదులు
భీమడోలు
సెల్: 9494246449

**IN THE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE-CUM-FAMILY ELURU, W.G.DISTRICT. COURT,**
**E.A.No. /2024 in EP No.163/2023**
**in ARC No.457/2012**

Between:
M/s. Shriram Finance Ltd., (formerly known as M/s. Shriram City Union Finance Ltd.,) Eluru ....Petitioner/DHr.
And
M/s.Lakshmi Chandra Industries, Prop: V.Srinivasa Rao and others ...Respondents/JDrs.

JDrs:
1. M/s. Lakshmi Chandra Industries, Prop: V. Srinivasa Rao, S/o.Purnachandra Rao, Hindu, Male, aged 55 years, H.No.1-26/2, Tallamudi village, Pedapdu Mandal, WG District.
3. V.Niranja Rao, S/o. Purnachandra Rao, Hindu, Male, aged 44 years, H.No.1-26/2, Tallamudi village, Pedapdu Mandal, WG District.
4. V.Rama Krishna rao, S/o. Purnachandra Rao, Hindu, Male, aged 42 years, H.No.1-26/2, Tallamudi village, Pedapdu Mandal, WG District.

యింది పై గ్రంథములో మీ యొక్క హాజరు నిమిత్తం **ది.22-08-2024వ** తేదీకి వాయిదా అయి వున్నది. ఆ రోజు ఉదయం గం.10.30 నిIIలకు పై కోర్టు వారి యెదుట వ్యక్తిగతంగా గాని, మీ లాయరు గారి ద్వారా గాని హాజరు అయిన మీ యొక్క అభ్యంతరములు తెలియచేసుకొన వలయును. లేనిచో మీ పరోక్షమున తీర్మానము చేయబడునని యిందుమూలముగా తెలియ చేయడమైనది.
**(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)**
K.V.S.N.R.GOPAL
Advocate, Eluru.